సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: వట్టినాగులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు సందర్భంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సందీప్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో.. ఖానాపూర్, వట్టినాగులపల్లి, ఇంద్రారెడ్డినగర్, వివేకానందనగర్, క్యూ సిటీ, అన్వయ కన్వెన్షన్, ప్రిజం రోడ్, వట్టినాగులపల్లి నుంచి కోకాపేట ఔటర్ ఎగ్జిట్ వరకు సర్వీసు రోడ్డు, మూవీ టవర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఆయన తెలిపారు.

నేడు పాఠశాల వార్షికోత్సవం

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రవీంద్ర భారతి పాఠశాల వార్షికోత్సవాన్ని ఈ నెల 7వ తేదీన పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళా తోరణంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు జడ్జి పుల్లా కార్తీక్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈ.విజయలక్ష్మి హాజరవుతారన్నారు.

క్లుప్తంగా...

ఎంఐఎం నాయకుల పర్యటన



మహమూద్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న మిర్జా రహమత్‌బేగ్

రాజేంద్రనగర్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎంఐఎం పార్టీ ఇన్‌చార్జీ మిర్జా రహమత్‌బేగ్ అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ నవాజుద్దీన్, జలమండలి అధికారులతో కలిసి మహమూద్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీని పరిశీలించారు. అనంతరం మిర్జా రహమత్‌బేగ్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జలమండలి జనరల్ మేనేజర్ కృష్ణకు సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ జహంగీర్, సయ్యద్ జావీద్, మతాముద్దీన్, ముజాద్ తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పిఅండ్‌టి కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ సభ్యులు ఆద్నాన్‌సిద్ధిఖి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆవిష్కరించారు.

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి జి.రాజేష్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఏబ్లాక్ అధ్యక్షులు నవీన్, కే.గణేష్, రాజు, ప్రకాష్, విజయ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

మైలార్‌దేవ్‌పల్లి: గత నాలుగు రోజులుగా జరుగుతున్న టెబుల్ టెన్నిస్ పోటీల్లో బాలురు, బాలికల జట్లు హోరాహోరీగా తలపడుతున్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను మహవీర్ గ్రూప్ ఆఫ్ కళాశాల యాజమాన్యం చేపట్టింది. కళాశాల మాజీ చైర్మన్ సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకార్థం జరుగుతున్న పోటీలలో కళాశాల చైర్మన్ సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ ఎస్.ధనుంజయరెడ్డి, జయలక్ష్మి, మల్లీశ్వరి, ప్రకాష్ రాజ్, నాగేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీ ఓవర్ వ్యూ



ఫుల్..ఫుల్

● కనిపించని టు లెట్ బోర్డులు ● హాస్టళ్లలోనూ నో వెకెన్సీ

మణికొండ: రెండేళ్లుగా కరోనా కారణంగా కుదేలైన ఆదాయం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. వర్క్ ఫ్రం హోంను అన్ని సంస్థలు క్రమక్రమంగా తగ్గించడం, విద్యాసంస్థలు మళ్లీ ఆఫ్‌లైన్ పద్ధతిలో తెరుచుకోవడంతో అద్దె గృహాలకు డిమాండ్ ఏర్పడింది. హైదరాబాద్ నగరానికి పడమర భాగం అటు ఐటీ సంస్థలు, ఇటు చిత్రపరిశ్రమ, అన్ని రకాల వ్యాపార సముదాయాలకు సమీపంలోనే ఉంది. దీంతో కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, మణికొండ, పుప్పాలగూడ, నానక్‌రాంగూడ, నార్సింగి, కోకాపేట, మంచిరేవుల, హైదర్‌షాకోట్, బండ్లగూడ ప్రాంతాలలో ఎక్కడా టు లెట్ బోర్డులు కనిపించటం లేదు. క్లాస్, మాస్ నివసించే అన్ని కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కరోనా కంటె ముందు ఉన్న అద్దెలు మళ్లీ తీసుకుంటున్నారు.

సింగిల్ బెడ్‌రూం రూ.10వేలు

గతేడాది జూన్ నుంచి పూర్తిస్థాయిలో పాఠశాలలు తెరుచుకోవటం, అక్టోబర్ మొదటి వారం నుంచి నుంచి ఐటీ సంస్థలు పూర్తి స్థాయిలో వర్క్ ఫ్రం హోం పద్ధతిని తొలగించడం నగరానికి వచ్చేవారి సంఖ్య పెరిగింది. దీంతో ఏకంగా సింగిల్ బెడ్ రూం అద్దె రూ.10వేలు, డబుల్ బెడ్ రూం రూ. 20 నుంచి రూ. 30వేలు, త్రిపుల్ బెడ్ రూం



అయితే రూ.25వేల నుంచి రూ.40 వేల వరకు చెబుతున్నారు.

జాడ లేని టు లెట్ బోర్డులు

మణికొండ, పుప్పాలగూడ, హైదర్‌షాకోట్, నార్సింగి, కోకాపేట, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో కరోనా సమయంలో ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో టు లెట్ బోర్డులు కనిపించేవి. ప్రస్తుతం ఎక్కడా వాటి జాడ కనిపించటం లేదు. ఎక్కడో ఒక చోట పెట్టినా సాయంత్రానికే అద్దెకు దిగేస్తున్నారని ఇంటి యజమానులు చెబుతున్నారు. దీనిని బట్టి అద్దె గృహాల డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండు సంవత్సరాలుగా అద్దెలు లేక ఇన్‌స్టాల్ మెంట్లు, ఇతర వాయిదాలు చెల్లించడానికి అనేక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం ఆ బాధలనుంచి బయట పడుతున్నామంటున్నారు.

హాస్టళ్లు హౌస్‌ఫుల్

ఐటీ సంస్థలతో పాటు ప్రముఖ విద్యా సంస్థలు హైదరాబాద్‌కు పడమర వైపున ఎక్కువగా ఉండటంతో ఉద్యోగులు, విద్యార్థులు ఉండే హాస్టళ్లకు డిమాండ్ పెరిగింది. ఆరు నెలల క్రితం వరకు సగంమంది కూడా లేక వెలవెలబోయిన హాస్టళ్లు కూడా ప్రస్తుతం హౌస్‌ఫుల్ బోర్డులతో దర్శనం ఇస్తున్నాయి. గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, కోకాపేట, గౌలిదొడ్డి ప్రాంతాల్లో అత్యధికంగా ఉన్న హాస్టళ్లలో గదులు దొరకటం లేదని పలువురు విద్యార్థులతో పాటు ఐటీ ఉద్యోగులు వాపోతున్నారు. హాస్టల్‌లో టిఫిన్, భోజనాలతో కలిసి షేరింగ్ రూపంలో రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు చెల్లించేందుకు ముందుకు వస్తున్నా అనుకూలమైన గదులు లభించడం లేదని పలువురు వాపోతున్నారు.

పూర్వ స్థితికి వచ్చింది



కరోనా సమయంలో నెలల తరబడి ఖాళీగా ఉన్న గృహాలు ప్రస్తుతం పూర్తిస్థాయిలో అద్దెల వారితో నిండిపోయాయి. గతంలో ఆరు నెలల పాటు టు లెట్ బోర్డులు పెట్టినా ఎవరూ రానిది ప్రస్తుతం బోర్డు పెట్టిన రోజే అద్దెకు దిగుతున్నారు. రాబోయే రోజుల్లో డిమాండ్ ఇలాగే ఉంటే అద్దెలు ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది.

– కె.పూర్ణచంద్రారెడ్డి, గృహాల యజమాని, మణికొండ

హాస్టల్ భవనాలు ఖాళీగా లేవు



ఐటీ సంస్థలు అన్నీ వర్క్ ఫ్రం హోంను పూర్తి స్థాయిలో ఎత్తివేయటంతో దూరప్రాంతాల ఐటీ ఉద్యోగులు హాస్టళ్లలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారు ఎక్కువ కావటం, హాస్టల్ భవనాలు తక్కువగా ఉండటంతో భారీగా డిమాండ్ ఏర్పడింది. గతంలో ఒకరికి రూ. 3నుంచి రూ. 5 వేల వరకు సౌకర్యాలను బట్టి తీసుకునే వారు. ప్రస్తుతం డిమాండ్ పెరిగిపోవటంతో అది కాస్త రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు తీసుకుంటున్నారు.

– జి.నగేష్‌యాదవ్, హాస్టల్ భవన యజమాని, గౌలిదొడ్డి

జేపీ నడ్డా వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రతి కార్యకర్త పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ పాలక్ మర్రి శశిధర్‌రెడ్డి

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి సాధ్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గ పాలక్ మర్రి శశిధర్‌రెడ్డి, కన్వీనర్ మల్లేష్‌యాదవ్, కో కన్వీనర్ మహాలింగంలు వెల్లడించారు. జేపీ నడ్డా బూత్ కమిటీల కార్యకర్తల వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌కి సంబంధించి శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేపీ నడ్డా బూత్ కమిటీల కార్యకర్తల వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో నియోజకవర్గంలోని అన్ని 535 బూత్ కమిటీలు ఖచ్చితంగా హాజరుకావాలన్నారు. సామాన్య కార్యకర్తలతో జాతీయ అధ్యక్షులు మాట్లాడం కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని ఇతర పార్టీల్లో మంత్రులకు కూడా అపాయింట్‌మెంట్ ఇచ్చే పరిస్థితులు లేవన్నారు. ఈ సమావేశంలో టి.అంజన్‌కుమార్, ఎస్.మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, రాచూరి రాజశేఖర్, బొక్క బాల్‌రెడ్డి, కాడెం సుధాకర్, సులిగె వెంకటేష్, ఎస్.జగన్, రావుల జగన్, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం 14వ రోజుకు చేరింది. కార్మికులు 13వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. పనులను కార్పొరేటర్ మాలతీ నాగరాజు పరిశీలించారు. వెస్టెండ్ కాలనీ, చంద్రయ్య కాలనీ, హిమగిరి నగర్ కాలనీ రోడ్ నెంబర్ 1,2, సాయిబాలాజీ నగర్, ఇండస్ వ్యాలీ, పార్కు, మెయిన్ రోడ్డు, విజయ మెడికల్ షాపు నుంచి చంద్రయ్య కాలనీ, యాదయ్యనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, సురేష్, యాదగిరి, సుభాష్, నరేందర్, రామాంజులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



13వ డివిజన్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాలతీనాగరాజు

అభివృద్ధికి నోచని ఎస్సీ స్మశానవాటిక

మైలార్‌దేవ్‌పల్లి: లక్ష్మిగూడ గ్రామంలో ఎస్సీ స్మశానవాటిక అభివృద్ధికి స్థానిక శాసన సభ్యులు ప్రకాష్‌గౌడ్ హామీ ఇచ్చారని ఇంతవరకు నెరవేర్చలేదని లక్ష్మిగూడ జాంబవంతుడి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సురేష్, ఉపాధ్యక్షులు డి.గిరిబాబులు అన్నారు. ఎస్సీ కమ్యూనిటీకి చెందిన స్మశానవాటిక ఎలాంటి అభివృద్ధి చెంద లేదని మరో పక్క ఇతర కులాలకు చెందిన స్మశానవాటిక పనులు పూర్తి కావచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.



సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

● పోలీసులకు తండావాసుల ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: సోషల్ మీడియాలో ఎంపీటీసీ పరువుకు భంగం కలిగేలా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని తండావాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దషాపూర్ తండాలోని గిరిజనుల భూములను క్రీడా ప్రాంగణం కోసం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఎంపీటీసీ సభ్యుడు చెక్కల ఎల్లయ్య బాధితులకు అండగా నిలిచారు. దీంతో ఎంపీటీసీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ గ్రామ సర్పంచు భర్త రాము నాయక్ గ్రామ వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టాడు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తండావాసులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

9న ‘మనూ’లో ఫౌండేషన్ డే లెక్చర్

రాయదుర్గం: మనూ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9వ తేదీ ఉదయం 11.30 గంటలకు గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఏ.ఎం పఠాన్ ఉపన్యసిస్తారు.

నయ్యర్ ఇక్బాల్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూలో పరిశోధక విద్యార్థి నయ్యర్ ఇక్బాల్‌కు పీహెచ్‌డీ ని శుక్రవారం ప్రకటించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో ‘ సాఫ్ట్ కంప్యూటింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి ఫీచర్ ఎంపిక, వ్యాధి అంచనా’ అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

యువత దేశ, సమాజ అభివృద్ధిలో పాల్గొనాలి

రాయదుర్గం: యువత దేశ, సమాజ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని యూత్ ఫర్ ఇంక్లూజివ్ అండ్ సస్టేనబుల్ సొసైటీ (వైఐఎస్ఎస్) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. నేటి తరం యువత, విద్యార్థులు ప్రత్యేకంగా పలు రకాల ట్రాన్స్‌ఫోమేషన్‌లు కలిగి ఉండాలని అందులో భావోద్వేగ, భౌతిక, ఆధ్యాత్మిక భావనలు ముఖ్యమైనవని అవి మిమ్మల్ని చైతన్యం చేస్తాయన్నారు. విద్యార్థి దశలో నైపుణ్యాలు పెంచుకోవడంపై కూడా దృష్టి సారించాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వైఐఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి కీరవాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైఐఎస్ఎస్ జాతీయ నాయకులు గౌతమ్ అరుణ్‌కేతన్, కిరణ్‌కుమార్, లక్ష్మీనరసయ్య, పవన్ నాయక్‌తోపాటు ద్యార్థులు పాల్గొన్నారు.

నార్సింగి ఠాణా ఎదుట వీరంగం

మణికొండ: దోపిడీ బెదిరింపులు, కత్తిపోట్ల సంఘటనకు సంబంధించిన కేసులో ఓ అనుమానితుడిని నార్సింగి పోలీసులు విచారణకు తీసుకొచ్చారు. అయితే విషయం తెలుసుకున్న అతడి బంధువులు శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఎదుట వీరంగం సృష్టించారు. ఇద్దరు బుధవారం రాత్రి రక్తమైసమ్మ దేవాలయం సమీపంలో కోకాపేటకు చెందిన తులసీకుమార్‌పై కత్తితో దాడి చేసి రూ. 15వేలు దోచుకోవటం, అక్కడే ఉన్న ట్రాన్స్‌జెండర్‌లను బెదిరించటం , కిషోర్‌రెడ్డిని కత్తులతో పొడవటంతో అతను మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు రాజేంద్రనగర్‌లోని సిఖ్‌చానీ నుంచి ఓ అనుమానితుడిని విచారణ నిమిత్తం తీసుకొచ్చారు. దీంతో అతని బంధువులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఉదయం నుంచి భోజనం పెట్టలేదని, అనుమానం ఉన్న ప్రతి ఒక్కరిని ఇలాగే తీసుకుని వస్తారా అంటూ ప్రశ్నించారు. మద్యం మత్తులో ఉన్న కొందకు ఏకంగా సీఐ శివకుమార్‌ను దూషించారు. అడ్డు వచ్చిన పోలీసులపైనా వీరంగం సృష్టించారు. విచారణ చేసి పంపిస్తామని ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలేదు. బయటకు పంపేవరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకున్నారు. తీరా సాయంత్రం విచారణ ముగిసిన అనంతరం అతడి పంపటంతో స్టేషన్ వద్ద పరిస్థితి సద్దుమణిగింది.

ఎలా విచారణకు తీసుకొస్తారని ఆందోళన



మద్యం మత్తులో సీఐతో వాదిస్తున్న అనుమానితుని బంధువులు

కరణ్‌సింగ్‌ను కస్టడికి తీసుకోనున్న పోలీసులు

కరణ్‌సింగ్‌ను కస్టడికి తీసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అతడిని రిమాండ్ చేయగానే విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటీషన్ వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కరణ్‌సింగ్ గత చరిత్రపై పోలీసులు విచారణ చేపట్టారు. పలు పోలీస్ స్టేషన్‌లలో ఉన్న కేసులపైనా నార్సింగి పోలీసులు దృష్టి పెట్టారు.

చౌరస్తాల ఆధునికీకరణకు ప్రతిపాదనలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ రేడియల్ రోడ్డులో రెండు చౌరస్తాల ఆధునికీకరణకు జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. పీడీపీ చౌరస్తా నుంచి హిమాయత్ సాగర్ వరకు గతంలో రేడియల్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రహదారి బిజీగా ఉంటుంది. రేడియల్ రోడ్డు గుండా అటూ ఔటర్, ఇటు నగరానికి, శివారు ప్రాంతాలకు వాహనదారులు వెళతారు. రాత్రి సమయంలో భారీ వాహనాలు సైతం శివారు నుంచి ఈ రహదారి నుంచే నగరంలోకి ప్రవేశిస్తున్నాయి. 24 గంటల పాటు ఈ రహదారి బిజీగా ఉంటుంది. రేడియల్ రోడ్డు వేసే సమయంలో గాంధీనగర్‌తో పాటు రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా, బుద్వేల్ సీపీఐ కార్యాలయం వద్ద నిర్మాణాలు ఉండడంతో వాటిని తొలగించలేదు. ప్రస్తుతం ఈ రోడ్డును వంద అడుగుల రోడ్డుగా చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించేందుకు వాటిని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. రాజేంద్రనగర్ ఎక్స్‌టెన్షన్, రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలను ఆధునికీకరించాలని నిర్ణయించారు. ఈ చౌరస్తాల వద్ద రోడ్డును వెడల్పు చేసి రాకపోకలకు అనువుగా డివైడర్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదన పంపారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాంతాల్లో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. వంద అడుగుల వెడల్పు చేస్తే ఈ రెండు ప్రాంతాల్లో రోడ్లు విశాలంగా మారి చౌరస్తాగా మారనుంది. రాకపోకలకు సైతం సులువుగా ఉంటుంది. ఉన్నతాధికారులు ఈ రహదారికి అనుమతి ఇస్తే మరో సంవత్సరంలో వంద అడుగుల రోడ్డుగా మారనుందని జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు.



రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ చౌరస్తా

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. రాజేంద్రనగర్ సర్కిల్ అభివృద్ధికి రూ.2.15 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఈఈ నరేందర్, అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌ల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్‌లకుగాను మొత్తం రూ.2.15 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. సమస్యల ప్రాధాన్యతను బట్టి వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం మంజూరైన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఏఈ బల్వంత్‌రెడ్డి తదితరులున్నారు.

స్కీమ్ వర్కర్ల ప్రైవేటీకరణ ఆపాలి



నార్సింగిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న స్కీమ్ వర్కర్‌లు

మణికొండ: తమ డిమాండ్‌ల సాధనలో భాగంగా స్కీమ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం గండిపేట మండల వర్కర్‌లు నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కవిత మాట్లాడుతూ స్కీమ్ వర్కర్‌ల ప్రైవేటీకరణ ఆపాలని, బడ్జెట్‌లో వారికి రూ. 26 వేల జీతం తగ్గకుండా కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.10 వేలకు తగ్గకుండా పింఛన్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి వారిపై పనిభారాన్ని తగ్గించాలన్నారు. స్కీము కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ రుద్రకుమార్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుధా, మీనా, జ్యోతి, సుకన్య, శ్రీలత, సరస్వతి తదితరులు ఆశ వర్కర్స్ నాయకులు అరుణ, శంకరమ్మ, శ్రీదేవి, రుక్మిణి, మధ్యాహ్న భోజన కార్మికులు సాలమ్మ, అంజమ్మ, రాణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

శంషాబాద్: పరిశ్రమల్లో కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలుచేసేలా ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జిల్లా సమావేశంలో మాట్లాడారు.. జిల్లాలోని పరిశ్రమల యజమాన్యాలు కార్మిక చట్టాలను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయన్నారు. భద్రతలేని జీవితాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి జంగయ్య, పర్వతాలు, రామస్వామి,దత్తునాయక్, సత్యనారాయణ, జైపాల్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

గ్రామకంతం భూమిని పరిరక్షించండి

తహసీల్దార్‌ను కోరిన నెక్నాంపూర్ వాసులు



నయాబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

మణికొండ: గ్రామకంతం భూమిగా ఉన్న దాన్ని వక్ఫ్‌బోర్డు స్థలమంటూ పాతిన బోర్డులను తొలగించి దాన్ని పరిరక్షించాలని నెక్నాంపూర్ గ్రామస్థులు గండిపేట తహసీల్దార్, నార్సింగి పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధి, నెక్నాంపూర్ గ్రామకంతం భూమిగా ఉన్న స్థలం సర్వే నంబర్ 62లోకి వస్తుందని, అది వక్ఫ్‌బోర్డుకు చెందుతుందని గురువారం రాత్రి బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు అది అనాదిగా గ్రామకంతం భూమిగానే ఉందని, అందులో మా గ్రామస్థులు రెజ్లింగ్, వ్యాయామశాలలు నిర్వహించటంతో పాటు ప్రతి సంవత్సరం వినాయక ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. గతంలో అనేక సార్లు సర్వేలు చేసినా అది గ్రామకంతం స్థలంగానే తేలిందని, ప్రస్తుతం వక్ఫ్ బోర్డు వారు అక్రమంగా బోర్డులు ఏర్పాటు చేయటం పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్థలాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, సీనియర్ నాయకులు జయరాజ్, టీడీపీ జిల్లా నాయకుడు తమోదన్‌రావు, బీజేపీ నాయకుడు శంకర్‌సింగ్, బీఆర్ఎస్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు నీలేష్‌ప్రసాద్ దూబే, ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్ మాదిగతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

శంషాబాద్: టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ద్వితీయ మహాసభల పోస్టర్‌ను పట్టణంలో టీయూడబ్ల్యూజే నాయకులు విడుదల చేశారు. ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగే ద్వితీయ మహాసభలతో పాటు ఏజేయూ పదో ప్లీనరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి పి. వెంకటేష్ పిలుపునిచ్చారు. 8 తేదీన పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమానికి యూనియన్ సభ్యులందరూ హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు అంజిలప్ప, నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి తలారి వెంకటయ్య, మండల అధ్యక్షుడు మసూద్ తదితరులు పాల్గొన్నారు.



టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు